క్లుప్తంగా

నార్నెపాడులో ఫ్యామిలీ డాక్టర్



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు నజీర్ పాల్గొని 98 మందికి వైద్య సేవలందించారు. 32 మందికి సాధారణ పరీక్షలు, 34 మందికి బీపీ, 26 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించినట్లు నజీర్ తెలిపారు. వీరితో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన వ్యాక్సిన్‌లు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శివపార్వతి, ఎంపీహెచ్ఏ జ్యోతి, డీఈవో కె.రవితేజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో టెన్త్ విద్యార్థినికి గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం సమీపంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన టెన్త్ విద్యార్థిని అనురాధ రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష రాసేందుకు వెళ్లింది. పరీక్ష రాసి తిరిగి ఇంటికి వచ్చేందుకు రోడ్డుపై ఉన్న సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో విద్యార్థినికి గాయాలయ్యాయి. హుటాహుటిన చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

లింగాపురంలో కార్డన్ సెర్చ్



పెదకూరపాడు(అమరావతి): ఈ నెల13న జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు సీఐ మంగారావు తెలిపారు. మండలంలో పలు సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెట్‌లు ఏర్పాలు చేస్తున్నామన్నారు. అలాగే మండల కేంద్రమైన పెదకూరపాడులో బుధవారం నిర్వహించిన కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో 6 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్ చేశామన్నారు. అలాగే గ్రామస్తులతో నిర్వహించిన శాంతి సమావేశంలో ఓట్ల లెక్కింపు రోజున ప్రజలంతా శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలని కోరారు. గ్రామంలో సుమారు 100 మంది పోలీస్ సిబ్బందితో పలు వీధులలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ నగదు

నకరికల్లు: జూన్ నెల 1వ తేదీన కూడా పింఛన్‌లను ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు ఎంపీడీవో డి.జయమణి బుధవారం తెలిపారు. ఇళ్లకే పరిమితమై బ్యాంకులకు వెళ్లలేని వారికి సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తారని అన్నారు. పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయిన పింఛన్ నగదును అదే రోజు నుంచి తీసుకోవచ్చన్నారు.

వైభవంగా పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: నాదెండ్ల శివారు గ్రామమైన జాష్టివారిపాలెంలో కొలువైయున్న పోలేరమ్మ తల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 150 ఏళ్ల క్రితం ఈ గ్రామంలో పెద్దలు ఆలయం నిర్మించారు. పురాతన ఆలయం జీర్ణావస్థకు చేరుకోవటంతో 2019లో ఆలయాన్ని పునర్నిర్మించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజారి మేకల నాగరాజు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యలగాల వెంకటేశ్వర్లు, దామనబోయిన సాంబశివరావు, మార్త నారాయణబాబు, యలగాల నాగేశ్వరరావు, అంగిరేకుల శ్రీనివాసరావు, మార్త శ్రీనివాసరావు, యలగాల అప్పారావు ఉన్నారు.

6వ రౌండ్‌లో అత్యధిక ఓట్లు

- ప్రతి రౌండ్‌కు 14 ఈవీఎంలు లెక్కింపు
- నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు
- 4న కౌంటింగ్‌లో తేలనున్న సత్తెనపల్లి ఫలితం



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న జరగనున్న సంగతి తెలిసిందే. నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఉండడంతో ఈసారి లెక్కింపు ప్రక్రియ 14 రౌండ్లతో పూర్తవుతుంది. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కిస్తే 6వ రౌండ్‌లో అత్యధిక ఓట్లు.. 20వ రౌండ్‌లో అత్యల్ప ఓట్ల లెక్కింపు ఉంటుంది.

సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో 2,42,047 మంది ఓటర్లలో పురుష ఓటర్లు 1,18,400 మంది, మహిళా ఓటర్లు 1,23,635 మంది, థర్డ్ జెండర్స్ 12 మంది ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో 274 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పురుష ఓటర్లు 1,03,116 మంది, మహిళా ఓటర్లు 1,07,381 మంది థర్డ్ జెండర్స్ ముగ్గురు ఓటేశారు. మొత్తం 2,10,500 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 86.97 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్‌టీయుకేలో జరగనుంది. అసెంబ్లీ ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు, పార్లమెంట్ ఓట్లను లెక్కించేందుకు గదులను కేటాయించారు. అసెంబ్లీ కౌంటింగ్ హాల్లో 14 టేబుళ్లు, పార్లమెంట్ కౌంటింగ్ హాల్లో 14 టేబుళ్లను లెక్కింపునకు ఏర్పాటు చేశారు. రెండు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించేందుకు నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేశారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు ఉండటం.. 14 టేబుళ్లను ఏర్పాటు చేయటంతో మొత్తం 20 రౌండ్లలో లెక్కింపు పూర్తవుతుంది. ప్రతి రౌండ్‌కు 14 ఈవీఎంలను తెరుస్తారు. మొదటి రౌండ్‌లో ఒకటో నెంబర్ పోలింగ్ బూత్ నుంచి 14వ నెంబరు బూత్ వరకు ఈవీఎంలను లెక్కిస్తారు. మొదటి 14 బూత్‌లను పరిశీలిస్తే 10,233 ఓట్లు పోలయ్యాయి. అంటే మొదటి రౌండ్‌కు సంబంధించి ఈ ఓట్లు లెక్కించడం జరుగుతుంది. తర్వాత రౌండ్ 15వ బూత్ ఈవీఎం నుంచి 28వ బూత్ వరకు 10,071 ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ లెక్కన ఇప్పటికే పోలైన ఓట్లను పరిశీలిస్తే అత్యధికంగా 6వ రౌండ్‌లో 12,734 ఓట్లను లెక్కించను న్నారు. అలానే 20వ రౌండ్‌లో అతి తక్కువగా 8 ఈవీఎంలకు చెందిన 6,431 ఓట్లను లెక్కిస్తారు. 20 రౌండ్లలో 16 రౌండ్లు 10 వేల కంటే ఎక్కువ ఓట్లు లెక్కింపు ఉంటుంది.

నియోజకవర్గంలో రౌండ్ల వారీగా లెక్కింపునకు వచ్చే ఓట్లు (17 సీ ప్రకారం)

రౌండ్	వచ్చే పోలింగ్ బూత్‌లు	లెక్కించే ఓట్లు
01	1-14	10,233
02	15-28	10,071
03	29-42	11,935
04	43-56	11,822
05	57-70	11,797
06	71-84	12,734
07	85-98	10,416
08	99-112	10,623
09	113-126	10,344
10	127-140	10,732
11	141-154	10,439
12	155-168	11,893
13	169-182	10,373
14	183-196	10,857
15	197-210	10,262
16	211-224	9,821
17	225-238	10,583
18	239-252	9,503
19	253-266	9,581
20	267-274	6,431

ఆర్బీకేలలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎకరాకు 10కిలోల చొప్పున 50శాతం సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. జీలుగ, జనము విత్తనాలు 10 కిలోల ప్యాకెట్ అసలు ధర రూ.880 కాగా సబ్సిడీపై రూ.440కు ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లిపెసర ఎకరాకు 8 కిలోలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తొలకరి వర్షాలు పడుతున్నందున రైతులు తమ భూములలో పచ్చిరొట్ట విత్తనాలు వేసి రెండు అడుగులు ఎత్తు పెరగగానే రోటవేటర్‌ద్వారా భూమిలో కలయదున్నాలని చెప్పారు. అలా చేయడంవల్ల అధిక దిగుబడులు సాధ్యపడతాయని చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం నకలుతోపాటు ఓటీపీ చూసుకునేందుకు ఫోను వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా ఏవో కోరారు.

శివాజీ మహారాజ్ జననం శివనేరి దుర్గం పుస్తకావిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డు మహారాష్ట్ర వీధిలో జూన్ 9న హైందవ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా ఆర్య క్షత్రియ ఆరే మరాఠా సంఘ అధ్యక్షుడు సింధు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం శివాజీ మహారాజ్ జననం శివనేరి దుర్గం అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పులహరి భానుజీ మాట్లాడుతూ జూన్ 9న జరిగే శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణకు వివిధ జిల్లాల్లో ఉన్న ఆర్య క్షత్రియ ఆరే మరాఠా సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నర్సోజీ, పి.గోవిందు, రామసాయి, విశ్వనాథ ప్రభు, కరుణాకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు ఎమ్మెల్యే పిన్నెల్లి వెంటే ఉన్నారు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గార్లపాటి దాసు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గార్లపాటి దాసు

క్రోసూరు: టీడీపీ, అధికారులు ఎన్ని కుట్రలు చేసినా మాచర్లలో ప్రజలు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెంట ఉన్నారని, తెలుగుదేశం కుట్రలకు, వారికి అంటకాగిన పోలీసు అధికారులకు హైకోర్టు గట్టి షాక్ ఇచ్చిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గార్లపాటి దాసు విమర్శించారు. బుధవారం క్రోసూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాసు మాట్లాడుతూ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికైనప్పటి నుంచి మాచర్ల నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామంలోనూ ఘర్షణలు తలెత్తకుండా పల్నాడు ప్రశాంతంగా ఉందన్నారు. ఏడుగురి హత్యా కేసులో నిందితుడైన జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా నియమించి ప్రశాంతంగా ఉన్న పల్నాడులో చంద్రబాబు నాయుడు హింసా రాజకీయాలకు, ఘర్షణలకు మూల కారణమయ్యాడని అన్నారు. పాలవాయి గేటు పోలింగ్ బూత్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను టీడీపీ కార్యకర్తలు ఓట్లు వేయకుండా అడ్డుకొని వారే ఆ బూతులో యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకుంటున్నారన్న సమాచారం మేరకు ఎమ్మెల్యే పిన్నెల్లి వెళ్లటం జరిగింది. ఆ క్రమంలో టీడీపీ రిగ్గింగ్‌ని అడ్డుకునేందుకు ఈవీఎంను నేలకేసి కొట్టటం జరిగిందన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు బెయిల్ ఇచ్చినా కుట్రపూరితంగా పోలీసు అధికారులు కొత్తగా మరో మూడు కేసులు నమోదు చేయటం దుర్మార్గమన్నారు. అధికారులు రానున్న రోజులలో తగినమూల్యం చెల్లించక తప్పదన్నారు. చంద్రబాబు నాయుడు, అవినీతి అధికారులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మాచర్ల నియోజకవర్గంలో ప్రజలు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెంటే ఉంటారని, ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తారని గార్లపాటి దాసు అన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా అధ్యక్షులు మరియదాసు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటర్ కమిటీ సభ్యులు సభావత్ రవి నాయక్ పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమజ్జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో భక్తాంజనేయ స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసి ఉన్న భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 31 నుంచి జూన్ 2 వరకు మూడు రోజుల పాటు హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 31న ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, తోరణ అలంకరణ, 7 గంటలకు ప్రాతఃకాలార్చన, 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, మండపారాధన, నవకలశ ఆరాధన, 9 గంటలకు పంచామృత స్నపన, 10 గంటలకు హనుమత్ హోమము, 11 గంటలకు రజత కవచ, పుష్పాలంకరణ, సహస్ర నాగవల్లీదళార్చన, 12 గంటలకు నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ గోష్టి, సాయంత్రం 5 గంటలకు హనుమత్ బోనాలు, నగరోత్సవం జరుగుతాయన్నారు. జూన్ 1న ఉదయం 7 గంటలకు ప్రాతఃకాలార్చన, విశేష పుష్పాలంకరణ, 8 గంటలకు వార్షిక చూత ఫలార్చన, 9:30 గంటలకు సహస్ర మామిడి ఫల విశేషార్చన, సామూహిక గంధ సింధూరార్చన, సాయంత్రం 5 గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రి 7 గంటల నుంచి అష్టోత్తర శత నామ పూజలు జరుగుతాయన్నారు. జూన్ 2న ఉదయం 7 గంటలకు ప్రాతఃకాలార్చన, 9 గంటలకు విశేష పుష్పార్చన, రాత్రి 7 గంటలకు పూలంగి సేవ, అనంతరం కొతారు రంజిత్ కుమార్ ఆర్కెస్ట్రా వారిచే భక్త సంగీత కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ వేదాంతం విజయనరసింహాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 122 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు బుధవారం 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు 557 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 478 మంది హాజరయ్యారు. 79 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఫిజిక్స్, ఎకానామిక్స్ పరీక్షలకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 266 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 223 మంది హాజరయ్యారు. 43 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ శైలజాకుమారి తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 669 మంది గైర్హాజరు

సత్తెనపల్లి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో బుధవారం 669 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. టెన్త్ ఫిజిక్స్ పరీక్షకు 2,163 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,494 మంది హాజరయ్యారు. 669 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

70 మంది గైర్హాజరు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదవ తరగతి సప్లిమెంటరీ ఫిజికల్ సైన్సు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు 217 మంది హాజరు కావాల్సి ఉండగా 147 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ అధికారి మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

నైపుణ్యమే ఉపాధి



మాట్లాడుతున్న హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు బుల్లిబాబు

సత్తెనపల్లి: విద్యార్థి దశలో ప్రతి అవకాశాన్ని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నేర్చుకునే పనిపై శ్రద్ధ పెట్టి నేర్చుకున్నట్లయితే ఆ నేర్చుకున్న నైపుణ్యమే భవిష్యత్తులో మనకి భరోసానిస్తుందని, ఆ నైపుణ్యమే మన జీవితంలో మనకి ఉపాధినిస్తుందని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ, ఉపాధి సెంటర్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్‌లో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలు భవిష్యత్తు అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సెంటర్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ సభ్యుడు సుభాని మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. బాలికలు, మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించినప్పుడు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిసర ప్రాంత పదవ తరగతి ఆపై చదువుకున్న 18-40 సంవత్సరముల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ట్రైనింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనింగ్ టీచర్ షేక్ మీరాబి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న అన్నదాతలు



ఎరువులు ట్రాక్టర్‌లో నింపుకుంటున్న రైతులు

నకరికల్లు: ఖరీఫ్ సీజన్ సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. వేసవి ముగుస్తుండడంతో పొలాలకు సేంద్రియ ఎరువులు చల్లే పనిలో నిమగ్నమయ్యారు. పశువుల పేడ ఎరువు పొలంలో చల్లుకొని అది బాగా మాగిన తరువాత కలియదున్నితే నేలకు పోషకాలు అంది పంట ఏపుగా పెరిగి చీడపీడలను తట్టుకునే శక్తి వస్తుంది. దీంతో పశువుల ద్వారా వచ్చే పేడ ఎరువు పొలాల్లో చల్లుకుంటున్నారు. ఎరువు లభ్యత తక్కువగా ఉన్న రైతులు ట్రక్కుల చొప్పున కొనుగోలు చేసి చల్లుకుంటున్నారు. క్వింటా ఎరువులో 0.5 నుంచి 1.5 శాతం నత్రజని, 0.3 నుంచి 0.9 శాతం భాస్వరం, 0.5 నుంచి 1.9 శాతం పొటాష్ ఉంటుంది. సేంద్రియ పదార్థం ద్వారా బరువు నేలలు గుల్లబారి వేరు ఏపుగా పెరగడం, నాణ్యమైన పంట ఉత్పత్తికి దోహదపడుతుంది. సేంద్రియ ఎరువులు సీజన్‌కు ముందు ఎకరాకు 5 నుంచి 6 టన్నుల చొప్పున చల్లుకుంటున్నారు.

పెరిగిన ఎరువు ధర

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సమీపించడంతో పేడ ఎరువు ధర గతేడాది కంటే ఈ ఏడాది పెరిగింది. ఎరువు కొనుగోలు, కూలీలు, బాడుగ మొత్తం కలిపి ట్రక్కుకు రూ.2 వేల పైగా ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 5 నుంచి 6 టన్నుల ఎరువు అంటే మూడు ట్రక్కుల వరకు అవసరమవుతుందని అంటే ఎరువుకే రూ.6 వేల వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు.

యువత అల్లర్లకు దూరంగా ఉండాలి



గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

రాజుపాలెం: మండలంలోని బలిజేపల్లిలో సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ల ఎస్ఐలు సయ్యద్ షమీర్‌బాషా, పి.రాంబాబు, పి.హజరత్తయ్య పాల్గొని గ్రామంలో ఎస్సీ, బీసీ, ముస్లిం మైనార్టీ కాలనీలలోని గృహాలను పరిశీలించారు. పాడుబడ్డ గృహాలతో పాటు గేదెల కొట్టాలు, గడ్డి వాములను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు, ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పోలీసు అధికారులు, సిబ్బంది మార్చింగ్ నిర్వహించారు. అనంతరం సీఐ రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరు వివాదాలకు వెళ్లవద్దని, అల్లర్లను ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత అల్లర్లకు దూరంగా ఉండాలని, మీ బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేల ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలన్నారు. ఏఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి



రోశయ్య మృతదేహం

సత్తెనపల్లి: ప్రమాదవశాత్తూ పొలం దున్నుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెంటపాళ్ళ గ్రామానికి చెందిన ఇస్తల రోశయ్య (40) ట్రాక్టర్‌తో గ్రామానికి చెందిన కారుమంచి రామకోటయ్య పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం దున్నుతుండగా ట్రాక్టర్ ఇంజన్‌కు ఉన్న హైడ్రాలిక్ పలిటి నాగలికి బిగించి ఉన్న లిఫ్ట్ వైర్లు సరిచేయడానికి హైడ్రాలిక్ ఇనుప నాగలి రన్నింగ్‌లో ఉండగానే రోశయ్య నిర్లక్ష్యంగా డ్రైవర్ సీటు కింద నుంచి దూరి వైర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తూ హైడ్రాలిక్ ఇనుప నాగలి, డ్రైవర్ సీటుకు మధ్య రోశయ్య ఇరుక్కుపోయి గుండెకు హైడ్రాలిక్ ఇనుప నాగలి ఒత్తుకొని పోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య ఇస్తల బుజ్జి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ సీఐ మల్లి రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశాజనకంగా పత్తి సాగు



కారెంపూడిలో సాగులో ఉన్న పత్తి పైరు

కారెంపూడి: మండలంలో వేసవిలో వేసిన పత్తి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. తుఫాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షాలు పంటకు మరింత మేలు చేశాయి. దీంతో పైర్లు కళకళలాడుతున్నాయి. దానికి తోడు రోహిణి కార్తెలో ఎండలు కూడా తక్కువగా ఉండడం కూడా పైర్ల ఎదుగుదలకు కలసి వచ్చింది. చాలా కాలంగా ఖరీఫ్‌కు ముందస్తుగా వేసవిలో పత్తి సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రియల్, మే నెలల్లో విత్తిన పత్తి పైర్లు దాదాపు కాపు దశకు చేరుకున్నాయి. గూడ, పూత దశలో ఉన్నాయి. మరో వారం పది రోజుల్లో పైర్లు అన్నీ దాదాపు పూర్తి స్థాయి కాపు దశకు వస్తాయి. ఇప్పటికే పైర్లు వేసి 45 రోజులు దాటినవి గూడ దశలో ఉన్నాయి. ఇంకా ముందస్తుగా వేసినవి గూడ, పూత దశకు చేరుకున్నాయి. మండలంలో బోర్లున్న రైతులు వేసవిలో ముందస్తుగా ఏప్రియల్, మే నెలల్లో పత్తి విత్తనాలు నాటారు. వేసవిలో గులాబి రంగు పురుగు బెడద తక్కువగా ఉండడం చీడపీడలు కూడా తక్కువగా వస్తాయని వేసవిలో పత్తి సాగు చేస్తున్నారు. బీటీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చిన దగ్గర నుంచి వేసవిలో పత్తి సాగు చేస్తున్నారు. పత్తి పంట అయిన తర్వాత ఆ పొలాల్లో రెండవ పంటగా మిర్చి, కంది లాంటి పైర్లు వేసుకోడానికి కాలం అదను కలసి వస్తుండడంతో వేసవి పత్తి సాగు జోరుగా చేపట్టారు. కారెంపూడి మండలంలో సుమారు 2,200 ఎకరాలలో ప్రస్తుతం పత్తి సాగులో ఉంది.

లంకెలకూరపాడులో కార్డన్ సెర్చ్



:గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ రాంబాబు, ఎస్సై హజరతయ్య

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో పోలీసు అదనపు బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని, నలుగురికి మించి గుమికూడటం నేరమన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ఎవరూ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. ముఖ్యంగా యువత రాజకీయ గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులు యువత జీవితాలను నాశనం చేస్తాయన్నారు. అనంతరం గ్రామంలో కార్డన్ సెర్చ్‌లో భాగంగా అనుమానిత గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. పాడుబడ్డ గృహాలు, ఖాళీస్థలాలు, వరిగడ్డి వాముల్లోను తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పోలీసు అదనపు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్సై పీ హజరతయ్య, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.